సాక్షి
విశాఖపట్నం

ఆదివారం । 14 । మే । 2023



ఉత్సాహంగా బీచ్ క్లీనింగ్

బీచ్‌రోడ్డు: నేవీ సిబ్బంది యారాడ, మంగమారిపేట, ఆర్కే బీచ్ ప్రాంతాల్లో శనివారం బీచ్ క్లీనింగ్ చేపట్టారు.



నగర ప్రశాంతత ముఖ్యం

నగర ప్రశాంతతకు ఆటో డ్రైవర్లు సహకరించాలని నగర క్రైం డీసీపీ జి.నాగన్న విజ్ఞప్తి చేశారు. 8లో



ప్రతిభా ప్రపూర్ణులు

ఏయూ విద్యార్థులు ప్రతిభా ప్రపూర్ణులని ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. 11లో

న్యూస్‌రీల్

ఏఎంసీలో పెరిగిన పీజీ సీట్ల భర్తీకి ఏర్పాట్లు



మహారాణిపేట: ఆంధ్రా వైద్య కళాశాల(ఏఎంసీ)లో పెరిగిన పోస్టు గ్రాడుయ్యేట్(పీజీ) సీట్ల భర్తీకి ఈ విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు తెలిపారు. ప్రస్తుతం ఏఎంసీలో 38 వైద్య విభాగాల్లో 237 సీట్లు ఉన్నాయి. 27 వైద్య విభాగాలకు సంబంధించి 131 సీట్లు పెంచాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన వారికి(ఈడబ్ల్యూఎస్) 131 సీట్లు కేటాయించింది. దీంతో ఏఎంసీలో మొత్తం సీట్ల సంఖ్య 368కి చేరింది. అయితే ఈ విద్యా సంవత్సరంలో 98 పీజీ సీట్ల భర్తీకి అనుమతులు వచ్చాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా మెడికల్, యురాలజీ, ఎండోక్రినాలజీ తదితర విభాగాలకు అనుమతులు రావాల్సి ఉందన్నారు.

11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొమ్మాది: జవహర్ నవోదయ విద్యాలయలో 2023–24 విద్యా సంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశానికి మొదటిసారిగా ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సంజయ్ తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో జిల్లా నుంచి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు 2006 జూన్ 1వ తేదీ నుంచి 2008 జూలై 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలని సూచించారు. మే 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి.. జూలై 22న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. 10వ తరగతి స్థాయిలో మెంటల్ ఎబిలిటీ, ఆంగ్లం, గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ విభాగంలో ఆబ్జెక్టివ్ పద్ధతిలో పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు www.navodaya.gov.in వెబ్‌సైట్ నుంచి వివరాలు పొందాలని ప్రిన్సిపాల్ సూచించారు.

విశాఖ రైల్వేస్టేషన్‌కు కన్సల్టేటివ్ కమిటీ

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కు స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ నియమిస్తూ ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఉత్తర్వులు జారీచేశారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి కె.విజయ్‌మోహన్, ఐశ్వర్య గంగూరి, స్థానిక విద్యా సంస్థల నుంచి జి.ఎస్.కె.చక్రవర్తి, ఎస్ఎస్ఎస్ఎస్ రెడ్డి, స్థానిక సంస్థల నుంచి కందుల నాగరాజు, పల్లా అప్పలకొండ, విశిష్ట వ్యక్తుల నుంచి కొప్పుల రామ్‌కుమార్, పి.వి.ఎస్.కె.సురేష్, నూకవరపు బాబ్జీ, డానియేల్ జోసఫ్‌లను నియమించారు.

అమ్మ ప్రేమ అమృతం

తోటకూర గింజలతో తల్లీబిడ్డ చిత్రం



మాకవరపాలెం: అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని తూటిపాల గ్రామానికి చెందిన బి.రవికుమార్ తోటకూర గింజలతో తల్లీబిడ్డ చిత్రాన్ని రూపొందించారు. మాతృమూర్తులందరికీ వందనం చెబుతూ 25 గంటల పాటు శ్రమించి 2,500 తోటకూర గింజలతో చిత్రాన్ని రూపొందించారు. సమాజహితంగా అనేక చిత్రాలను రూపొందించి రవికుమార్ ఆదర్శంగా నిలుస్తున్నారు.

సాటో.. నోట తెలుగు మాట

వృత్తి రీత్యా విశాఖ నగరంలో భర్త ఉద్యోగం. ఆయన ఉద్యోగానికి వెళ్లాక ఖాళీ సమయాన్ని భాష అభ్యసనానికి వెచ్చిస్తున్నారు జపాన్‌కు చెందిన హిరొకొ సాటో. తెలుగు భాషను నేర్చుకోవాలనే అభిలాషతో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టిన సాటో.. కొన్ని నెలల్లోనే తెలుగు అక్షరాలు, గుణింతాలు, పదాలు నేర్చుకున్నారు.



హిరొకొ సాటో

- తెలుగు నేర్చుకుంటున్న జపాన్ మహిళ
- ఏయూ ఆచార్యుల తోడ్పాటు

SUNDAY SPECIAL

ఏయూక్యాంపస్: కాయి చిసాట్ విశాఖలోని టొయోటా సంస్థలో ఉన్నత ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తన భార్య హిరొకొ సాటోతో కలిసి నగరంలో నివాసం ఉంటున్నారు. భర్త ఉద్యోగానికి వెళ్లిన తర్వాత ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె భావించారు. స్థానికంగా ప్రజలు మాట్లాడే తెలుగు భాషను నేర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. వెంటనే దగ్గరలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగాన్ని సందర్శించి, అక్కడ కోర్సులో చేరాలని ఆసక్తి వ్యక్తం చేశారు. తెలుగు విభాగంలో కేవలం రెండేళ్ల పీజీ కోర్సు మాత్రమే ఉండటం, డిగ్రీ స్థాయిలో తెలుగు అభ్యసించిన వారికే ఇందులో ప్రవేశం కల్పించే అవకాశం ఉండటంతో సాటో కాస్త నిరాశ చెందారు. తెలుగు విభాగానికి చేరువలో జపాన్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఉందని తెలుసుకుని విభాగాధిపతి ఆచార్య డి.వి.ఆర్.మూర్తితో మాట్లాడారు. ఆయన సూచనతో జర్నలిజం విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.విజయలక్ష్మి వద్ద ఎనిమిది నెలలుగా తెలుగు భాషను నేర్చుకుంటున్నారు. ఆరుపదులకు చేరువవుతున్న సాటో ఎంతో ఇష్టంగా తెలుగు భాషను నేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు.

కష్టమైనా ఇష్టంగా..

కేవలం జపాన్ భాషను మాట్లాడటం, కొద్ది కొద్దిగా ఆంగ్ల మాట్లాడడం వచ్చిన హిరొకొ సాటోకి తెలుగు నేర్చుకోవడం మొదట్లో కష్టతరంగా మారింది. మెల్లమెల్లగా ఆంగ్ల పదాలకు సమానమైన తెలుగు పదాలను నేర్పడంతో ఆమె భాషా ప్రయాణం ప్రారంభమైంది. అలా తెలుగు అక్షరాలు చదవడం, రాయడం నేర్చుకుని ప్రస్తుతం తెలుగు పదాలను రాయడం, చదవడం, మాట్లాడే స్థాయికి వచ్చేశారు. మధ్యలో తన కుటుంబ సభ్యులను చూడటానికి జపాన్ వెళ్లడంతో.. భాష నేర్చుకునే ప్రయాణంలో కాస్త విరామం వచ్చింది. తెలుగు అక్షరాలు, గుణింతాలు, అక్షరమాల, అమ్మ, ఆవు, ఇల్లు, ఈగ వంటి పదాలతో పాటు నిత్యం సంభాషించే నమస్కారం, బాగున్నారా, నా పేరు సాటో, మళ్లీ కలుద్దాం, తక్కువ–ఎక్కువ, చిన్నది–పెద్దది, నెమ్మదిగా–వేగంగా వంటి పదాలను ఒడిసిపట్టి మాట్లాడేస్తున్నారు. తెలుగు పదాలు, భాష కొంత సంక్లిష్టంగా ఉంటుందని.. అయినా తనకు నేర్చుకోవడం ఎంతో ఆనందాన్నిస్తోందని సాటో అంటున్నారు. తన పేరును కూడా తెలుగులో రాసే విధంగా ఆమె పరిణితి చెందారు. వారంలో మూడు రోజులు విభాగానికి వచ్చి తెలుగు నేర్చుకుంటూ.. మిగతా రోజుల్లో ఇంటివద్దనే సాధన చేయడం అలవాటుగా మార్చుకున్నారు.



అక్షరాలు నేర్చుకుంటున్న జపాన్ మహిళ

మా ఇల్లు విశాఖ.. పిల్లి పేరు సూర్య

విశాఖ ప్రజలు చాలా స్నేహంగా ఉంటారని, ప్రకృతి మధ్యలో విశాఖ నగరం అద్భుతంగా ఉందని సాటో తెలిపారు. ఉదయం చెట్లను చూడడం, పక్షుల శబ్దాలు వినడం తనకు ఇష్టమన్నారు. నిత్యం కోడి కూతతో తాను నిద్రలేస్తున్నట్లు చెప్పారు. చికెన్ బిర్యానీ రుచి చూశానని, మసాలా దోసె అంటే చాలా ఇష్టమన్నారు. ఇంట్లో కూడా దోసె చేస్తానన్నారు. కారం ఎక్కువ తినమని, వంటలో కొద్దిగా మసాలా వినియోగిస్తున్నట్లు చెప్పారు. కేకులు ఇష్టపడతానని, సమోసా, అరకు కాఫీ రుచి చూశానన్నారు. విశాఖలో సంపత్ వినాయక గుడి, ఆంజనేయ స్వామి గుడి దర్శించుకున్నానని చెప్పారు. గిరిజన సహకార సంస్థ ఉత్పత్తులు తాను వినియోగిస్తున్నానని, చాలా బాగుంటాయని కితాబిచ్చారు. అరకు కాఫీ రుచిని ఆస్వాదిస్తున్నట్లు చెప్పారు. రాజమండ్రి నుంచి పిల్లిని తీసుకొచ్చి పెంచుకుంటున్నామని.. దానికి సూర్య అని పేరు పెట్టినట్లు చెప్పారు.

శీఘ్రమేవ శ్రీశైలం దర్శన ప్రాప్తిరస్తు!

- అందుబాటులోకి ఆర్టీసీ సర్వీసు
- శీఘ్ర దర్శనం రూ.170, అతి శీఘ్రం రూ.320, స్పర్శ దర్శనానికి రూ.520
- విశాఖ నుంచి తొలిసారిగా ఈ తరహా సదుపాయం



సాక్షి, విశాఖపట్నం: శ్రీశైలం మల్లన్న దర్శనానికి వెళ్లే భక్తులకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే భక్తులకు శ్రీశైలం మల్లికార్జునుడిని దర్శించుకునే సదుపాయాన్ని కల్పించింది. రోజూ విశాఖ నుంచి శ్రీశైలానికి సూపర్ లగ్జరీ సర్వీసు నడుస్తోంది. ఈ బస్సు సాయంత్రం 5.15 గంటలకు విశాఖ ద్వారకా బస్‌స్టేషన్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం ఏడు గంటలకు శ్రీశైలం చేరుకుంటుంది. ఈ దూరానికి టికెట్ చార్జీ రూ.1,220 ఉంది. ఈ బస్సులో భ్రమరాంబికా మల్లికార్జునస్వామి దర్శనం కోసం వెళ్లాలనుకునే వారికి మూడు రకాల దర్శన చార్జీలను నిర్ణయించింది. టికెట్టు ధరకు అదనంగా శీఘ్ర దర్శనానికి రూ.170, అతి శీఘ్ర దర్శనానికి రూ.320, స్పర్శ దర్శనానికి రూ.520 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. శ్రీశైలం చేరుకున్నాక కొండపైకి షటిల్ సర్వీసు అందుబాటులో ఉంటుంది. ఆర్టీసీ బస్సులో శ్రీశైలం దర్శనం టికెట్టు తీసుకుని ప్రయాణించిన భక్తులకు ఆ షటిల్ బస్సులో కొండపైకి తీసుకెళ్తారు. వీరు సంబంధిత దర్శన టికెట్టుతో నేరుగా దర్శనానికి వెళ్లవచ్చు. దీనివల్ల ఆ భక్తుడు స్వామి దర్శనం టికెట్ల కోసం క్యూలైన్లో నిల్చోవలసిన అవసరం ఉండదని, నేరుగా దర్శనానికి అనుమతించడం వల్ల సమయం కూడా ఆదా అవుతుందని ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ 'సాక్షి'కి చెప్పారు. శ్రీశైలం మల్లన్న దర్శనం కోసం ఆర్టీసీ కల్పించిన ఈ వెసులుబాటును భక్తులు వినియోగించుకోవాలని కోరారు. కాగా శ్రీశైలం మల్లన్న దర్శనానికి వెళ్లాలనుకున్న వారు అడ్వాన్స్ టికెట్ బుకింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ద్వారకా బస్‌స్టేషన్ కౌంటర్‌లో ప్రత్యేక దర్శనం టికెట్లు పొందే వీలుంది. ఇప్పటికే తిరుపతి వెంకన్న దర్శనానికి ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే భక్తులకు ఇలాంటి సదుపాయాన్నే కల్పించింది. ఇందుకోసం టికెట్ ధరతో పాటు స్వామి దర్శన టికెట్ రూ.300 చెల్లించాల్సి ఉంటుంది. దీనికి మంచి ఆదరణ లభిస్తోంది. తాజాగా అందుబాటులోకి తెచ్చిన శ్రీశైలం స్వామి దర్శన టికెట్ వెసులుబాటుకు కూడా అలాంటి ఆదరణే ఉంటుందని ఆర్టీసీ వర్గాలు భావిస్తున్నాయి.

మత్తు ఇంజక్షన్లు స్వాధీనం

పోలీసులు అదుపులో ఇద్దరు వ్యక్తులు

అల్లిపురం: మత్తు ఇంజక్షన్లు కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్సు పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2,100 మత్తు ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను టూటౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు విచారణ చేపడుతున్నారు. నిందితులు పశ్చిమబెంగాల్, ఒడిశా ప్రాంతాల్లో మత్తు ఇంజక్షన్లు తక్కువ ధరకు కొనుగోలు చేసి, నగరంలో యువతకు అమ్ముతున్నారని టూటౌన్ పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మత్తు ఇంజక్షన్లు

ఉచిత విద్య దరఖాస్తుకు నేడే ఆఖరు

రెండో విడతలో ఇప్పటికే 610 దరఖాస్తులు

విశాఖ విద్య: పేద విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్య అందించేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుంది. జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న 585 ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఒకటో తరగతిలో 25 శాతం సీట్ల కోటా పూర్తిస్థాయిలో విద్యార్థులు వినియోగించుకునేలా విద్యాశాఖాధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే తొలివిడత ప్రవేశాలు పూర్తికాగా, అర్హులందరికీ మేలు చేకూరేలా ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ నెల 15 లోపు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. పూర్తి వివరాల కోసం సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

తొలివిడతలో 668 మందికి లబ్ధి

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత సీటు పొందేందుకు విశాఖ జిల్లాలో తొలివిడతలో 1,490 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,079 మంది పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు. వివిధ దశల్లో పరిశీలన అనంతరం లాటరీ విధానంలో రెండు దఫాలుగా విడుదల చేసిన జాబితాలో 668 మందిని ఎంపిక చేశారు. వీరంతా పాఠశాలల్లో చేరేలా ఎంఈవోలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. విశాఖ వ్యాలీ వంటి డిమాండ్ ఉన్న స్కూళ్లలో సైతం విద్యార్థులకు ఉచిత విద్యకు అవకాశం లభించింది.

సచివాలయ స్థాయిలో విస్తృత ప్రచారం

జిల్లాలో ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు ముందుకొచ్చిన 585 పాఠశాలల్లో 25 శాతం సీట్లు కోటా పూర్తయ్యేలా విద్యాశాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. సచివాలయం యూనిట్‌గా విస్తృత ప్రచారం చేస్తున్నారు. సచివాలయ విద్యా కార్యదర్శి, గ్రామ/వార్డు వలంటీర్లకు దీనిపై బాధ్యతలు అప్పగించారు. దీంతో ప్రజల్లో చైతన్యం వచ్చింది. రెండో విడతకు ఇప్పటికే 610 దరఖాస్తులు వచ్చినట్లు డీఈవో చంద్రకళ తెలిపారు.

వివక్ష లేకుండా ప్రభుత్వ పథకాల అమలు

రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున

తాటిచెట్లపాలెం: ఎస్సీ, ఎస్టీలకు నేరుగా పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ భవనాన్ని ఆయన సందర్శించారు. దళిత సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మధ్యవర్తుల ప్రమేయం లేకుండా.. రాజకీయ వివక్షకు తావు లేకుండా ప్రభుత్వ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. దళితులు కోరిన ప్రతీ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం చేసినట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో కమ్యూనిటీ సెంటర్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. విజయవాడలో రూ.350 కోట్లతో అంబేడ్కర్ మోమోరియల్ స్థూపాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఏపీ సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని, కొత్త జిల్లాల్లో గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలని భీమ్‌సేన ప్రతినిధులు మంత్రికి వినతి పత్రం అందించారు. ఈ అంశాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పినట్లు భీమ్‌సేన సభ్యులు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకరరావు, ఉపాధ్యక్షుడు టి.గురుమూర్తి, కోశాధికారి జి.సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులు రాంబాబు, గౌతంబాబు, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు, భీమ్‌సేన అధ్యక్షుడు రవి సిద్ధార్థ, దళిత నేత మాటూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నాగార్జునకు వినతిపత్రం అందజేస్తున్న భీమ్‌సేన ప్రతినిధులు

రాజీమార్గమే రాజమార్గం



కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు



న్యాయసేవా సదన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, న్యాయమూర్తులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్
- 36 బెంచీల ద్వారా 8,657 కేసుల పరిష్కారం

అల్లిపురం: దీర్ఘకాలిక సమస్యలకు రాజీ మార్గమే రాజమార్గమని, అందుకు జాతీయ లోక్ అదాలత్ వేదికే శాశ్వత పరిష్కారమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. కక్షిదారులకు ఇదొక సదవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా న్యాయ సేవాధికార సదన్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని సివిల్ కేసులు, మోటార్ యాక్సిడెంట్, చట్టపరంగా రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, లిటిగేషన్, చెక్కు బౌన్స్, మోటార్ వెహికల్ నష్టపరిహారం తదితర కేసులు పరిష్కారానికి వచ్చాయన్నారు. లోక్ అదాలత్‌లో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 36 బెంచీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా కోర్టులో 14 బెంచీలు, మండలాల్లో 22 బెంచీలు ఏర్పాటు చేసి 8,657 కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. నష్టపరిహారం కింద రూ.13కోట్లు కక్షిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.తిరుమలరావు, రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కృష్ణమోహన్, బైపా అరుణ్‌కుమార్, న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

అయ్యన్ ప్రణతికి 'మెగా' ఆతిథ్యం

విశాఖ కీర్తి ద్విగుణీకృతం చేయాలని చిరంజీవి ఆశీస్సులు

డాబాగార్డెన్స్: ప్రముఖ ఓటీటీలో ప్రసారమవుతున్న తెలుగు ఇండియన్ ఐడల్–2లో విశాఖకు చెందిన గాయని బేబీ అయ్యన్ ప్రణతి విజేతగా నిలవాలని మెగాస్టార్ చిరంజీవి ఆకాంక్షించారు. ఈ పాటల పోటీల్లో డాక్టర్స్ కాలనీకి చెందిన అయ్యన్ ప్రణతి టాప్–6లో కొనసాగుతూ విజయం వైపు దూసుకెళ్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మెగాస్టార్.. అయ్యన్ ప్రణతిని కుటుంబ సమేతంగా తన నివాసానికి ఆహ్వానించారు. ప్రణతి మధురగానాన్ని భార్య సమేతంగా ఆస్వాదించారు. ఆమె ప్రతిభను ప్రశంసించి.. ఘనంగా సత్కరించారు. ఇంత చిన్న వయసులోనే ప్రణతి అసమాన ప్రతిభ కనబరుస్తున్న తీరును భార్య సురేఖ, తన మనవరాలికి వివరించారు. ప్రణతి అన్నా.. ఆమె పాటలన్నా చాలా ఇష్టమని పేర్కొన్నారు. చిరంజీవి సతీమణి కూడా ప్రణతితో చాలా సేపు ముచ్చటించి.. చిన్నారి మధురగానానికి ముగ్ధులైపోయారు. మెగాస్టార్‌తో ప్రణతి సెల్ఫీ దిగి ముచ్చటపడింది. మెగాస్టార్ చిరంజీవి దంపతులు తమ పట్ల ఇంత అభిమానం చూపించడంపై ప్రణతి తల్లిదండ్రులు రామేశ్వరపు ఉదయ్‌కుమార్, భారతిదేవి ఆనందపరవశులయ్యారు. అద్భుత ఆతిథ్యమిచ్చారని, వారి గొప్ప సంస్కారానికి హ్యాట్సాఫ్ అంటూ కొనియాడారు.



మెగాస్టార్‌తో సెల్ఫీ తీసుకుంటున్న ప్రణతి



చిరంజీవి దంపతులతో ప్రణతి, ఆమె తల్లిదండ్రులు భారతీదేవి, ఉదయ్‌కుమార్

సీఎం హామీపై సిక్కుల కృతజ్ఞతలు

దొండపర్తి: రాష్ట్రంలో సిక్కుల అభివృద్ధికి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సిక్ మిషన్ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి దిల్‌షా సింగ్ ఆనంద్ ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రిని కలవగా.. ఆయన తమ సమస్యలను సావధానంగా అడిగి తెలుసుకున్నారని పేర్కొన్నారు. వాటన్నింటినీ తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. గురుద్వార్ల మీద ఆస్తి పన్ను తొలగించడంతో పాటు గ్రాంథీలకు ప్రయోజనం చేకూరేలా చూస్తామని సీఎం చెప్పినట్లు వివరించారు. తమ సమస్యలపై సీఎం చూపిన చొరవ పట్ల సిక్కు సమాజం హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో డాక్టర్ మురళీకృష్ణ మృతి

- మునగపాకలో విషాదఛాయలు
- కరోనా కష్టకాలంలో విస్తృతంగా సేవలందించిన మురళీకృష్ణ



మురళీకృష్ణ (ఫైల్)



డాక్టర్ మురళీకృష్ణ మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య పుష్ప

మునగపాక: కరోనా కష్టకాలంలో విస్తృతంగా సేవలందించి, అందరి మన్ననలు పొందిన మునగపాకకు చెందిన వైద్యుడు మళ్ల మురళీకృష్ణ రాంబిల్లి మండలం సోలార్ పరిశ్రమ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో మునగపాకలో విషాదఛాయలు అలుముకున్నాయి. మాజీ జెడ్పీటీసీ, మునగపాక గ్రామానికి చెందిన మళ్ల సంజీవరావుకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. చిన్న కుమారుడు మురళీకృష్ణ వైద్యవిద్య అభ్యసించారు. విశాఖ, అచ్యుతాపురం తదితర ప్రాంతాల్లో వైద్యుడిగా సేవలందిస్తున్నారు. మురళీకృష్ణ భార్య పుష్ప విశాఖ కేజీహెచ్‌లో జనరల్ సర్జన్‌గా సేవలందించి ఇటీవలే అగనంపూడి ఆస్పత్రిలో జనరల్ సర్జన్‌గా బాధ్యతలు చేపట్టారు. మురళీకృష్ణ దంపతులు అగనంపూడిలో నివాసం ఉంటున్నారు. అక్కడ నుంచే మురళీకృష్ణ పలు ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు. కాగా.. శనివారం మధ్యాహ్నం రాంబిల్లి మండల పరిధిలో వైద్య సేవలందించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో యూనిపార్స్ పరిశ్రమ నుంచి సుందరం ఎల్లాయిస్ పరిశ్రమకు వెళ్లే రోడ్డులో సోలార్ ఫార్మా కంపెనీ సమీపంలో డివైడర్‌ను బైక్‌తో ఢీకొట్టడంతో మృతి చెందారు. హెల్మెట్ ధరించి ఉంటే మురళీకృష్ణ ప్రాణాలు దక్కేవని స్థానికులు తెలిపారు. మురళీకృష్ణ మృతదేహాన్ని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మునగపాక గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకుని మురళీకృష్ణ కుటుంబ సభ్యులను ఓదార్చారు. మురళీకృష్ణకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. ఆయన భార్య పుష్ప గుండెలవిసేలా రోదించారు.

బాత్‌రూమ్‌లో యువకుడి మృతదేహం

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): బాత్‌రూమ్‌లో ఒక యువకుడి మృతదేహం బయటపడింది. ఇంట్లో నుంచి తీవ్రంగా దుర్వాసన వస్తుండడంతో ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా విషయం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన మట్లపూడి దుర్గాప్రసాద్ (30) ఎంవీపీకాలనీ సెక్టార్–12లోని ఓ అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. అతను ఓ షోరూంలో సేల్స్‌మన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. గత కొన్ని రోజులుగా అతని ఇంట్లో నుంచి రాకపోకలు లేవు. ఇంటి యజమాని కూడా పట్టించుకోలేదు. రెండు రోజులుగా ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో ఇంటికి వెళ్లి చూడగా లోపలి నుంచి గడపెట్టి ఉంది. దీంతో ఆ యజమాని ఎంవీపీ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు తలుపులు విరగ్గొట్టి లోపలికి వెళ్లి చూడగా దుర్గాప్రసాద్ మృతదేహం బాత్‌రూమ్‌లో కనిపించింది. మృతదేహం పురుగులు పట్టి ఉండగా, శరీరంపై ఎలాంటి దుస్తులు లేవు. బాత్‌రూమ్‌లో కాలిజారి పడటం వల్ల తలకు గాయమై చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు సీఐ మల్లేశ్వరరావు వెల్లడించారు.

నగర ప్రశాంతతకు సహకరించాలి

ఆటో డ్రైవర్లకు క్రైం డీసీపీ నాగన్న సూచన

అల్లిపురం: నగర ప్రశాంతతకు ఆటో డ్రైవర్లు సహకరించాలని నగర క్రైం డీసీపీ జి.నాగన్న విజ్ఞప్తి చేశారు. పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం ఆయన ఆటో డ్రైవర్లతో సమావేశమయ్యారు. నగరంలో నేరాలు అరికట్టడంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్రమ రవాణా, అనుమానితులను గుర్తించడంలో పోలీసులకు సహకరించి, నగర ప్రశాంతతకు తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు, ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ అధ్యక్షుడు మెరపురెడ్డి కొండబాబు, సీఐటీయూ ఆటో యూనియన్ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, ఏఐటీయూసీ ఆటో యూనియన్ జనరల్ సెక్రటరీ రెహమాన్, అధ్యక్షుడు పడాల గోవింద్ పాల్గొన్నారు.

గోల్ఫ్ విజేత యువరాజ్

విశాఖ స్పోర్ట్స్: ఐజీయూ ఏపీ అమెచ్యూర్ గోల్ఫ్ చాంపియన్‌షిప్‌ను యువరాజ్ సాధించాడు. ఇక్కడి ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో జరిగిన ఈ టోర్నీలో టైటిల్ కోసం యువరాజ్ సింగ్ (పంజాబ్)తో హరిమోహన్‌సింగ్(ఉత్తరప్రదేశ్) పోటీపడ్డాడు. హోరాహోరీగా సాగిన పోరులో 4ప్లేఆఫ్‌లో యువరాజ్ విజయాన్ని సొంతం చేసుకొని టైటిల్ అందుకున్నాడు. నెంబర్ వన్ సీడ్ గోల్ఫర్ సౌర్యభట్టాచార్యతో కలిసి గతేడాది విజేత మిలింద్ సోనీ సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. 65 మంది గోల్ఫర్స్ ఈ టోర్నీలో పాల్గొన్నారు.